# భూతం!




## కాకాని కమల

అర్ధరాత్రి దాటింది. సమయం రెండు గంటలు కావస్తోంది.

ఇరుకుగా వున్న ఎర్రటి మట్టిరోడ్డు రెండు వైపులా మనిషెత్తు నిలువుతో చుట్టూ పాలు పోసుకుంటున్న వరిపొలాలు. మధ్యగా నిటారుగా వున్న తాటిచెట్టుకి "కంకిపాడు" అన్న నల్లటి బోర్డు

ఆ నిశ్శబ్ద వాతావరణంలో పెద్దగా శబ్దం చేస్తూ డిస్ట్రిక్ట్ బస్సు వచ్చి సరిగ్గా ఆ తాటి చెట్టు దగ్గర ఆగింది

చిన్న ఎయిర్‌బ్యాగ్‌తో మూర్తి బస్సుదిగాడు మరునిముషం దుమ్ము రేపుకుంటూ బస్సు కన్ను మరుగయ్యింది.

మూర్తి చేతిరుమాలు తీసి ఒక్కసారి మొహం తుడుచుకున్నాడు బట్టలమీద పడిన దుమ్మని సుతారంగా దులుపుకున్నాడు. పైరుమీదనుంచి వీచే చల్లటిగాలికి ఎగురుతున్న క్రాఫ్ సరిచేసుకున్నాడు.

అసలే ఊరుచివర .. పొలాలు ... విశ్రాంతి కావటంతో అంతా నిర్మానుష్యంగా వుంది

తలెత్తి చుట్టూ కలయచూశాడు.

కీచురాళ్ళరొద తప్పించి ఇతరత్రా ఏ అలజడి లేదు.

అక్కడక్కడ కొట్టంలో కట్టేసిన పశువులు కూడా మేతమాని ఆదమరిచి నిద్రపోతున్నాయ్.

దాదాపు రెండు ఫర్లాంగులు నడిస్తేగాని ఊళ్లోకి చేరటం సాధ్యం కాదు

కంకిపాడు శుద్ధ పల్లెటూరు కావటంతో పగలయినా రాత్రయినా రిక్షా, మోటారులాంటి ప్రయాణ సౌకర్యాలు గాని, ఆఖరుకి లగేజి మొయ్యటానికి కూలికూడా దొరకడు.

మూర్తి ఒక ముఖ్యమైన పనిమీద రావాల్సి వచ్చింది. కంకిపాడులో గవర్నమెంటు డాక్టరుగా పనిచేస్తున్న రమేష్, మూర్తికి ప్రాణమిత్రుడు. ఇంతకుముందు కూడా ఒకటి రెండుసార్లు ఆ ఊరికి వచ్చాడు మూర్తి. కాని పగటివేళ కావటంతో ఒకసారి ఊళ్ళోకి వెడుతున్న ట్రాక్టర్ ఎక్కాడు. ఇంకొకసారి ఎద్దుబండి ప్రయాణం ఆ అనుభవం చాలా గమ్మత్తు అనిపించింది మూర్తికి పట్నంలో పుట్టి పట్నంలోనే పెరిగిన అతనికి ఆ పల్లెటూరి ప్రయాణం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా మిగిలిపోయింది

ఏ బస్సుకి వచ్చేది ఉత్తరం వ్రాస్తే మనిషిని పంపుతానని ఉత్తరంలో వ్రాశాడు రమేష్.

కాని మూర్తికి అంత తీరికలేదు. ముందుగా ముహూర్తం పెట్టుకుని ప్రయాణం చేసేటంత వీలుకుదరదు. "ఎప్పుడు వచ్చేది తెలియదు. ఈ నెలాఖరులోగా ఎప్పుడో ఒకప్పుడు వస్తా"నని మిత్రుడికి జవాబు వ్రాశాడు. కాబట్టి గుమ్మంలోకి వెళ్ళేదాకా రమేష్‌కి, మూర్తి ఆగమనం సంగతి తెలియదు!

మూర్తి ఎయిర్‌బ్యాగ్ భుజాన వేసుకుని జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. సన్నగా ఈలపాట పాడుకుంటూ కాలిదారివెంట నడక సాగించాడు.

దూరంగా తీతువుపిట్ట వికృతంగా అరుస్తూ పంటచేలమీదుగా గుండ్రంగా గిరికీలు కొడుతూంది.

ఒంటరిగా ఆ పొలాలమధ్యనుంచి నడుస్తుంటే ... ఆ అనుభవం... మూర్తికి వింత అనుభూతి కలిగించింది ఆదే ఇంకొకరయితే అలాంటి సమయంలో భయపడి వుండేవారు. కాని . మూర్తికి అలాంటి భయాలేం లేవు!

కంకిపాడు గురించి రమేష్, అతని భార్య రాధ చెప్పగా చాలా కథలు విన్నాడు. ఆ ప్రాంతంలో దయ్యాలు తిరుగుతాయని, తరచూ దారిదోపిడీలు జరుగుతాయని విన్నాడు. చాలా ఉదంతాలు ప్రచారంలో వున్నాయి కూడా.

కాని ... మూర్తి చిన్నప్పట్నుంచి మొండి మనిషి. పెంకెఘటం! మోటు ప్రవర్తన! బాల్యంలో స్నేహితులతో పందెంకట్టి అర్ధరాత్రి ఊరు చివర శ్మశానంలోకి వెళ్ళి వచ్చేవాడు. కాలుతున్న శవాలని కర్రతో కదిలించేవాడు.

ఆ మర్నాడు విషయం ఇంట్లో తెల్సి తల్లి, నానమ్మ లబలబ మొత్తుకునేవారు. ఏ గాలిఅయినా సోకిందేమోనని ఎర్రనీళ్ళు తీసి తాయెత్తు

కట్టించేది బొమ్మ. మూర్తికి చిన్నప్పట్నుంచి దేముడన్నా, దెయ్యంఅన్నా లక్ష్యం లేదు. మెడిసన్ మూడవసంవత్సరం పూర్తిచేశాక అతని అభిప్రాయం మరింత ధృఢపడింది. ''దయ్యం'' అన్న పదం వింటే అతనికి విపరీతంగా నవ్వు వచ్చేది ప్రజల్లో ఎంత మూఢత్వం నాటుకుని పోయిందో అని జాలిపడేవాడు. ''నానమ్మా! మనమే ఓ పెద్ద దయ్యాలం. ఇంకా దయ్యాలు ఎక్కడివి ?'' అని పగలబడి నవ్వేవాడు.

ఇంక దారిదోపిడి దొంగలన్నా మూర్తికి అస్సలే భయంలేదు. ఎప్పుడూ ప్రయాణ సమయంలో చాలా జాగ్రత్తగా వుంటాడుమూర్తి తనదగ్గిర ఆట్టే విలువైన వస్తువులు, ఎక్కువగా డబ్బు పెట్టుకోడు అంతగా అవసరం అనిపిస్తే ట్రావెలింగ్ చెక్స్ రూపంలో జాగ్రత్తపడతాడు.

మూర్తి హుషారుగా నడుస్తున్నాడు

పైన నింగిలో దశమి చంద్రుడు ప్రక్కనే దారిపొడుగున పంటకాలువ అలలు చంద్ర బింబం సన్నటి ఆ నీటిపాయలో ప్రతిఫలించి తను కూడా తోడుగా వస్తున్నట్లు అనిపించింది అతడికి ''సుజాత'' జ్ఞాపకం వచ్చింది. ఆ చల్లటిగాలి .. వెన్నెల అన్నీ ప్రియురాలి స్పర్శని జ్ఞాపకం తెచ్చాయి మంచులో తడిసిన పుష్పంలా అతడి హృదయం పులకరించింది. ''సుజీ' అనుకున్నాడు తమకంగా

''ఇంకెంత ? ఈ హవుస్ సర్జన్ షిప్ అయిపోయిందంటే ఆమె తన కౌగిలో బందీ అప్పుడు ఈ వెన్నెల చల్లగాలి ఇద్దరికీ సేద దీరుస్తుంది...'' మూర్తి మనసు పాటపాడింది పెదవులమధ్య ఆఖరిదశలోవున్న సిగరెట్‌ని గట్టిగా దమ్ము పీల్చి పంటకాలవలోకి విసరబోయాడు. అంతే! తల ఎత్తిన అతని చూపు ఆట్టే నిలిచి పోయింది ! ?

ఎవరో ఆసామి ఒంగి కూర్చుని పంటకాల్వలో నీళ్ళు తాగుతున్నా- కావిరంగు పంచె, ఖద్దరు జుబ్బా ధరించాడు బొద్దు మీసాలతో, గుబురుగా వున్న కనుబొమలతో నునిషి బాగా నాటుతేలి మోటుగా వున్నాడు. కాయకష్టం చేసుకునే రైతని చెప్పకనే తెలుస్తోంది.

మూర్తిని చూస్తూనే లేచి నిల్చుని పలకరించాడు.

''ఎవరు బాబూ ! ఇంత రాత్రేళ ఒంటరిగా ఎలుతున్నారు ? ఊళ్ళోకా ?'' అన్నాడు.

అతడు మాత్రం ఒంటరిగా లేక పదిమంది మధ్య వున్నట్టు. మూర్తికి నవ్వు వచ్చింది.

''ఊఁ ... వూళ్ళోకే! నువ్వేమిటి ? ఇక్కడ కూర్చున్నావ్ తీరుబడిగా ?'' అడిగాడు.

ఆసామి భుజంమీద తుండుతో మొఖం, చేతులు తుడుచుకుని ఆ గుడ్డని తలకి పాగాలా చుట్టు కున్నాడు. ప్రక్కనేవున్న చెఱకుగడల కట్ట తలకి ఎత్తుకున్నాడు.

''పదండి బాబూ ! నేనూ ఊళ్ళోకే! ఈ ఉదయం పనిబడి పొరుగూరికి వెళ్ళాను. అక్కడ బయలుదేరేసరికి బాగా పొద్దుయిపోయింది. రాత్రికి ఆగిపోదామంటే పొలంపన్లు అన్నీ చెడిపోతాయి...'' అన్నాడు

# భూతం!

''ఊఁ...'' దీర్ఘంతీశాడు మూర్తి.

ఈ పల్లెటూరివాళ్ళని కదిపితేచాలు పొలం పన్లు అంటారు. అంతకు తప్పించి వేరే లోకజ్ఞానం వుండదు సరే... ఏదో తోదు దొరికాడు అనుకుని నడుస్తూనే అతని మాటలు వింటున్నాడు మూర్తి.

...పిల్లకి పెళ్ళి సంబంధం వుందని తెస్తే పొరుగూరికి వెళ్ళాడుట ! ఆ పెళ్ళికొడుక్కి ఆస్తి వుందట అందుకని కట్నం అడగుతున్నాడుట !...

ఆ ఆసామి ఏదో చెప్తూనేవున్నాడు. అనాశక్తి కరంగానే ఊఁ కొడతున్నాడు మూర్తి.

మూర్తి భావుకుడు కాదు అతనికి ఒంటరి తనం అంటే విసుగు ఎప్పుడూ పదిమంది మధ్య నవ్వుతూ, తుళ్ళుతూవుంటాడు. చిన్నప్పట్నుంచి అంతే! ''మూర్తి వుంటేనే సందడి అతను పదిమంది పెట్టే' అన్న పేరు ఇంటా బయటా అతనికి వుంది.

''అబ్బా!'' బంకమట్టిలో కాలు జారితే నిభాయించుకున్నాడు చేనుగట్టు సన్నగా ఎత్తుపల్లాలతో వుందేమో ఒక్క నిమిషం బేలన్సు తప్పితే ప్రక్కనే వున్న కాలవలో పడివుండేవాడు ఒడుపుగా ఆపుకున్నాడు.

''జాగ్రత్త బాబూ! ఈ దారంతా బంకమన్ను జలగలు... భద్రం మాకంటే అలవాటు...'' హెచ్చరించాడు ఆసామి.

క్రమంగా చీకటి పల్చబడి చంద్రుడు దిగుతున్నాడు. తూరుపు ఆకాశం తెల్లబారుతోంది. మూడవఝాము, దూరంగా ఎక్కడో కోడి కూసింది.

మూర్తి ఆగి మసక వెలుగులో వాచ్ కేసి చూశాడు సమయం మూడు గంటలు దాటుతోంది

''దొరా! మీరెటుపోవాల ?'' అడిగాడు ఆసామి.

''నేనిటు స్కూలువైపు వెడతాను. డాక్టరు గారింటికి వెళ్ళాలి '' అన్నాడు మూర్తి.

''మంచిది దొరా ! నానిటువెళ్ళాలి. సెలవిప్పించండి.'' అన్నాడు తలమీద మోపు సర్దుకుంటూ

''అద్సరే! ఇంతకీ నీ పేరవిటయ్యా. చెప్ప లేదు...'' అడిగాడు మూర్తి.

''నర్సయ్య బాబు! బాబూ! మీరు మంచి కోడెవయసులో వున్నారా! ఓ మాట చెప్తా. ఏమనుకోరుగా ?'' వూపిరి తీసుకున్నాడు నర్సయ్య.

''ఏమిటి !? ' ఆశ్చర్యంగా చూశాడు మూర్తి.

''ఏంలేదు బాబయ్యా! మాలాంటివాళ్ళ కంటె అలవాటే అనుకోండి. ఇంకమీదట ఇట్లా ఒంటరిగా రాత్రిళ్ళు ప్రయాణం చెయ్యకండి బాబు! ఊరు చివర... శ్మశానాలు... అంత మంచిది కాదు...'' అంటూ చెయ్యిచాచి మూర్తి వీపుమీద గట్టిగా ''ఛెళ్ళు''మని శబ్దం వచ్చేలా చరిచాడు.

అంతే!

మూర్తి కళ్ళముందు పెద్ద మెరుపు మెరిసింది. ఒక్క క్షణం కళ్ళముందంతా చీకటి! నుదురంతా చెమటపట్టి గుండె ఆగినంత పని అయ్యింది. అగాధంలోకి పడిపోతున్నట్లు అనిపించింది.

'నర్స . ...'' గట్టిగా కేకవెయ్యబోయాడు శక్తి చాలలేదు. ఎవరో తోస్తున్నట్లు ధబ్బున నేలమీద పడ్డాడు అంతే!

* * *

తెల్లవారుఝామున కూలిపన్లకి బయలుదేరిన జనం చేలగట్లమధ్య పడివున్న మూర్తిని వూళ్ళోకి చేరవేశారు.

పేషంటు స్థానంలో వున్న మిత్రుడ్ని చూస్తూనే నివ్వెరపోయాడు డా॥ రమేష్.

మూర్తి తలకి దెబ్బ తగిలింది. కొద్దిగా రక్తం పోయింది విపరీతమైన జ్వరం! మూడు రోజులపాటు మంచం దిగలేకపోయ్యాడు.

రమేష్ శాయశక్తులా శుశ్రూష చేసి మిత్రుడ్ని స్వల్ప వ్యవధిలో కోలుకునేలా చేశాడు.

ఆ తరవాత అంతా మామూలే!

కొద్ది నెల్ల క్రితం నర్సయ్య అన్న రైతు పొరుగూరునుంచి అర్ధరాత్రి ఇంటికి వస్తూ విషనాగు కరిచి చచ్చిపొయ్యాడని, ఇప్పుడు అతడే దెయ్యం అయి తిరుగుతున్నాడని ఆ ఊళ్ళో ఒక పెద్ద వదంతి వుంది. అక్కడి వూరి ప్రజల్లో ఒక విధమైన భయం వుంది

''అది నర్సిగాడి దయ్యం పనే'' అన్నారంతా ముక్తకంఠంతో. రమేష్‌కి కూడా ''ఔనేమో!'' అనిపించింది.

కాని మూర్తి అందుకుససేమిరా ఒప్పుకో లేదు.

''నేను కాలుజారి క్రిందపడివుంటాను ప్రక్కనే వున్న సర్వేరాయి తలకి తగిలింది. రక్తం చిమ్మింది. స్పృహ తప్పింది. అంతే!'' అని అతని వాదన.

''సరే. అదే నిజమయితే ఆ ఆసామి మాట ఏమిటి ? అతడు నీతోపాటే వూళ్ళోకి వచ్చాడు కదా! నీవు ఆపదలో వున్నప్పుడు తోటి మనిషిగా నీకు సహాయపడవచ్చునే ?'' అన్నాడు రమేష్. రాధ భర్తని సమర్థించింది.

''ఏమో! అదంతా నాకు తెలియదు. దెయ్యం లేదు భూతం లేదు. ఎక్కడో... ఏదో... పొరపాటు జరిగివుంటుంది. చూస్తూవుండండి. ఈసారి మళ్ళీ ఈ ఊరు వచ్చినప్పుడు అర్ధరాత్రి ఒంటరిగా ప్రయాణంచేసి మరీ వస్తాను. పొలాల మధ్యన నిల్చుని ఆ నర్సిదయ్యాన్ని పేరు పెట్టి మరీ పిలుస్తాను. దాని తడాకా ఏమిటో అప్పుడు చూస్తాను!'' అన్నాడు ఛాలెంజి చేస్తున్నట్లు చెయ్యి వూపుతూ.

వింటున్న రాధకి శరీరం జలదరించింది. కళ్ళు విశాలంగా అయ్యాయి.

''అమ్మబాబోయ్! మీరు మొండిమనిషి. ఇంత జరిగినా ఇంకా ఆ మాట అనగలుగుతున్నా రంటే... ఇట్స్ నాట్ జోక్...'' భయంగా గుండెలమీద చెయ్యి వేసుకుంది.

మూర్తి సన్నగా నవ్వాడు.

కాని... అతని అంతరాత్మ మొరాయిస్తూనే వుంది.